మృత్యు శిరస్కమును, (మరణాది రూపమును,) బహు విధమును అగుచు, ఆశ్రితజనమునకుఁ గలుగు భీతి నపనయించునదియు, విబుధుల చేత (విద్వాంసుల చేతఁగాని దేవతల చేతఁగాని) స్తుతింపఁబడునదియు, శివయు, నగు భగవతి – దృశ్యములగు విషయముల యందు సంగమును విడిచి, విలోకనమును (దర్శనకర్మను) విలోకించుచున్న క్రాంతదర్శియగు కావ్యనిర్మాత యొక్క విలోచనము నందు (దృష్టియందు) సన్నిహితయగు చుండును. (సాన్నిధ్యము నొసఁగుచుండును.)

ప్రభ:- విషయముల తోడి సంబంధమును విడిచి విషయములందు ప్రవర్తించుచున్న దృష్టికి ద్రష్టయగునతఁడు, కావ్యస్రష్టయగుచున్నాడు. క్రాంతదర్శియగు నతని దృష్టియందు – భగవతి – నిత్య సన్నిహితయు, సర్వభయాపహయు, నయివెలయుచుండునని భావము. కవులకీ యుపాసన మావశ్యకమని తెలియునది.

మూ॥ అయం భయానాం పరిమార్జకస్సతాం
సమస్తపాపౌఘ నివారణక్షమః।
మనోజ్ఞ వంశస్థగణో గణేశితు
ర్మనో మహేశాబ్దదృశోధినోత్వలమ్॥ 25

సజ్జనుల భయములన్నింటిని నివారించునదియు, సమస్త పాపసమూహమును ధ్వంసము చేయుటకు శక్తి గలదియు, గణపతికవి చేత రచియింపఁబడినదియు, అగు వంశస్థవృత్తగణము – మహేశ్వరుని యబ్జాక్షియగు పార్వతియొక్క మనస్సును మిక్కిలి సంతోషింపఁ జేయునుగాత!

ఇది – సవ్యాఖ్యమగు త్రయస్త్రింశస్తబకము

* * * *

ఓం నమోభగవతే శ్రీ రమణాయ శ్రీ భారతీదేవ్యైనమః

ఉమాసహస్రము

(తొమ్మిదవ శతకమున – ద్వితీయ స్తబకము)

చతుస్త్రింశస్తబకము

అవ:- ఈ ముప్పది నాలుగవ స్తబకమునందు మానవమాంగల్యము కొఱకు భరతఖండక్షేమ సంపాద నేచ్ఛచేత – భగవతిని బహు విధముల ప్రార్థించుచున్నాఁడు.

మూ॥ విదిత మహిమా విశ్వాధానా దనేక విధాద్భుతాత్
ప్రథితచరితః శర్వాలోక ప్రతాప వివర్ధనాత్
ప్రకటితగుణః పాపధ్వాన్త ప్రసార నిరోధనాత్
ప్రదిశతు శివాహాసో భాసాంనిధిః కుశలానిమే. 1

అనేక ప్రకారములగు నాశ్చర్యములు గల జగత్తును సృజించుట వలన తెలియఁబడిన మహిమ గలదియు, రుద్రుని యొక్క ఆలోకప్రతాపమును వృద్ధినొందించుట వలన – ప్రఖ్యాతమయిన చరిత్రము (నడవడి) గలదియు, పాపములను, చీకటుల యొక్క వ్యాప్తిని; నిరోధించుట వలన ప్రకాశింపఁజేయఁబడిన తేజో, బల, వీర్యాదిగుణము గలదియు, కాంతులకు నిధియు అగు పార్వతీహాసము నాకు కుశలముల నొసఁగుగాత!

ప్రభ:- దేవీహాసము – నానావిధాద్భుత జగత్ సృష్టివలన – నిజమహిమను తెలియఁజేయుచున్నది. పరమేశ్వరదృష్టికి వీర్యమును గలిగించుట వలన విఖ్యాతమగు చేష్టితము గలిగియున్నది. పాపతిమిర ప్రసారమును తొలగించుట వలన గుణములను

ప్రకటించుచున్నది. కాంతుల కాకరమైయున్నది. ఆ హాసము - నాకు క్షేమముల నిచ్చుఁగాతయని ప్రార్థింపఁబడినది.

విశే:- ఇచట - వివిధమును, అద్భుతమును, అగు ప్రపంచమును పుట్టించుటయను సాధనము వలన సాధ్యమగు మహిమ యొక్క జ్ఞానమును. శివ దృష్టి వీర్యవర్ధమను సాధనము వలన సాధ్యమగు చరిత్రము యొక్క జ్ఞానమును, పాప ప్రసార నిరోధమను సాధనము వలన - సాధ్యమగు తేజోబలాది గుణమును, ప్రతిపాదింపఁబడినది. కావున నిది - యనువూనాలంకారమగుచున్నది. ''విచ్ఛిత్తిచేత (వైచిత్రిచేత) సాధ్యము యొక్క జ్ఞానమును సాధించుట. అనుమానము'' అను సాహిత్యదర్పణోక్తమగు లక్షణము నిచట నెఱుఁగునది.

మూ॥ హృదికరుణయా పూర్ణా బాహ్వోర్బలేన మహీయసా
పదకమలయోర్లక్ష్మ్యాభక్తైర్జనైరుపజీవ్యయా
ముఖసితకరే లావణ్యేన త్రికోణ దృశాంబలం
బహువిదధతా కాలీమాతాఽవతాత్ పదసేవినమ్ 2

హృదయమునందు దయచేత పూర్ణయు (నిండినదియు) బాహువుల యందు మహత్తరమగు బలము చేత పూర్ణయు, (నిండినదియు) పదకమలముల యందు, భక్తులగు జనుల చేత ఆశ్రయింపఁదగిన లక్ష్మి చేత (శోభచేత, లేక సంపద చేత) పూర్ణయు, ముఖచంద్రుని యందు త్రినేత్రుని యొక్క దృష్టులకు, మిక్కిలి బలమునిచ్చు లావణ్యముచేత పూర్ణయు, అగుచున్న మాతయగు కాళి - పాదసేవకుని రక్షించుఁగాత!

ప్రభ:- ఇందు - దయాదులు - హృదయాదుల నాశ్రయించినట్లు తెలిపివాని భేదము వలన ఒక్క తెయేయగు కాలీమాతను బహువిధముల నుల్లేఖించుట వలన నుల్లేఖమలంకారమగుచున్నది.

మూ॥ జగదధిపయా సిద్ధం దోర్గ్యాఽభవోత రసజ్ఞయా
మునిజననుతం దేవీ మన్త్రం జపేద్ యదిమానవః
అమృతజలదీభూతః పూతః వియోగవిశేషవిత్
స ఇహ వసుధాలోకే ధారాగిరా మభివర్షతి. 3

(కడచిన స్తబకమున వ్యాఖ్యానింపఁబడిన) భువనేశ్వరి చేతను గాని, ప్రచండ చండిచేతనుగాని, కాలిచేఁగాని, సిద్ధమగు (సంపన్నమగు) నదియు, తపస్వులుల చేత స్తుతింపఁబడునదియు, అగు దేవీమంత్రమును, మానవుఁడు జపించునెడల వాఁడు - అమృతజలదీభూతుఁడై, (అమృతవర్షియై) పవిత్రుఁడై, ప్రయోగవిశేషవిదుఁడై, యీ భూలోకమునందు వాగ్ధారలను చక్కగా వర్షించును.

ప్రభ:- భువనేశ్వరి, ప్రచండచండి, కాలి, ననుమూర్తిత్రయమును, తద్ బీజత్రయమును, కడచిన స్తబకమున వ్యాఖ్యానింఁబడినవి. పూర్వోక్తమగు దేవీమంత్రమును జపించునఁతడు - సర్వసుఖావహములును, అవ్యు తప్రాయములును, అగు వాణులను వర్షించునని భావము.

మూ॥ ఇమమభిముఖీ భూతాశాతోదరీ కమలాలయా
హయగజఘటాపూర్ణాభ్యర్ణం సమేత్య నిషేవతే
సవిబుధమిదం విశ్వం తస్య ప్రయాతి పునర్వశమ్
ప్రథితయశసాం సిద్ధీనాంచాప్యముంభజతేఽష్టకమ్. 4

ఈ దేవీ మంత్ర జాపిని- కృశోదరియగు కమలాలయ (లక్ష్మి) అశ్వములచేతను, గజఘటచేతను, పూర్ణయై - సమీపించును. మఱియు, దేవతలతోఁగూడిన యీ జగత్తు- వానికి వశపడును. ఈ యుపాసకుని - విశ్రుతమగు కీర్తిగల అణిమాద్యష్టసిద్ధులును గూడ సేవించును.

మూ॥ సువిమలధియ స్తస్య క్రోధాద్ దృగమ్బుధుతద్యుతీ
రిపుజనవధూగణ్డాభోగో భవేదుతపాణ్డురః।
సపది భువనవ్యాప్తం చాప్తైః ప్రమాణపురస్సరం
భణితమజరం భద్రం జ్యోతిః పరంహృదిభాసతే. 5

అత్యంతమును విశుద్ధమగు బుద్ధిగల దేవీ మంత్రజపకర్త యొక్క రోషము వలన – శత్రుకాంతలకపోలస్థల విస్తారము – వారి కన్నీటి చేత తొలఁగింపఁబడిన కాంతిగలదై (విచ్ఛాయమై) పాండుర (తెల్లని) వర్ణము గలదగును. విశ్వమునందంతటను వ్యాపించియున్నదియు, వయోవిద్యావృద్ధులగు అప్తులచేత ప్రమాణ పురస్సరముగా (అనుభవజన్యవాక్య పూర్వకముగా) ప్రతిపాదింపబడినదియు, అజరమును (జరాదిషడ్ వికారములు లేనిదియు) భద్రమును, (శోభనమును) అగు పరజ్యోతి – వాని హృదయము నందు శీఘ్రముగానే స్ఫురించుచుండును.

ప్రభ:- దేవీ మంత్రమును జపించు మనుష్యునికి కోపము కలిగిన యెడల – వాని శత్రువులు ప్రధ్వంసము నొందుదురు. కావున వారి స్త్రీలకు వైధవ్య ప్రాప్తివలన కలుగు నశ్రుధారచేత – వారి ముఖకాంతి నశించి తెల్లపడును. అప్పుడతనికి తన హృదయమున – జ్యోతిస్స్వరూపమగు నాత్మ – వెంటనే ప్రకాశించునని భావము.

విశే:- దేవీ మంత్రసిద్ధునకు కోపము కలుగనేరదు – ఒకప్పుడు కలిగిన యెడల నతని హృదయమున సర్వవ్యాపియగు పరమేశ్వరజ్యోతి – జ్వలించును. కావుననే తత్క్రోధము – శత్రుస్త్రీ వైధవ్యాధాయి విక్రమమగును. ఇందు సమర్థనీయమును, పూర్వవాక్యార్థ గతమును, అగు శత్రుస్త్రీ కపోల దేశపాండిమ – హృదయ గత పారమేశ్వర జ్యోతిర్దీప్తిరూపమగు ఉత్తరవాక్యార్థము చేత సమర్థింపఁబడినది. కావున నిందలి యలంకారము – వాక్యార్థహేతుకమగు కావ్యలింగమగుచున్నది.

మూ॥ అదయమరిభిః క్రాన్తే రాష్ట్రే, త్వమీశ్వరి! రక్షితా!
సుమశరముఖైర్ధూతే చిత్తే, త్వమీశ్వరి! రక్షితా
ప్రబలదురితైర్గ్రస్తే వంశే, త్వమీశ్వరి! రక్షితా
హృస్సృజతిజలం మేఘే మోఘే, త్వమీశ్వరి! రక్షితా 6

ఈశ్వరీ! శత్రువులు – నిర్దయులై రాష్ట్రము నాక్రమించునపుడు నీవే రక్షకవు. (దిక్కు) కామక్రోధాదులు – మనస్సును చలింపఁజేయునపుడు నీవే రక్షకవు. బలిష్ఠములగు పాపములు – మానవకులమును ఆవేశించినపుడు నీవే రక్షకవు. మేఘము – మోఘమగునపుడు కూడ (వర్షింపనపుడును) నీవే రక్షకవు.

ప్రభ:- సర్వకాలములందును నీవే రక్షింతువని భావము.

మూ॥ భగవతి! నిజౌ సాక్షాత్పుత్రౌ బృహస్పతి పావకౌ।
గణపతి గుహావేతౌ వేషాన్తర వ్యవహారతః।
భరతధరణీఖణ్డే హేతోః కృతసమ్భవౌ
కలకలయు తే కాలే దేవి ! వ్యథాః కథయద్రుతమ్ 7

భగవతీ! జననీ! నీ నిజపుత్రులగు బృహస్పతి – పావకులు (బ్రహ్మణస్పతి - అగ్నులు) ఇంకొక వేషముచే నగు వ్యవహారము చేత – ఈగణపతి – గుహులై, భారతభూఖండమున కోలాహలయుతమగు నీకాలమునందు – ఏ కారణమువలన జన్మించునట్లొనరించితివో, దయయుంచి చెప్పుము.

ప్రభ:- గణపతియే గణపతిమునియనియు - గుహుఁడే (కుమారస్వామియే) రమణమహర్షి యనియు నిచట గుర్తించునది.

మూ॥ సమయమయితే ధృత్వా పాదామ్బుజం రమణఃసుతో
గిరివరగుహాస్వన్తః శాన్తోనయేద్యదినాద్భుతమ్।
స్థలవిరహతః స్వీయస్థానే కిమత్రసమాగతో
న వదసికుతః కార్యం తస్మై కులాచలకన్యతే! 8

అమ్మా! పుత్రుఁడగు రమణుఁడు (గుహుఁడు) నీపాద పద్మమును గ్రహించుట వలన, అంతఃశాంతుఁడై (ఆత్మనిష్ఠచేత శాంతి సంపన్నుడై) గిరి శ్రేష్ఠమగు నరుణాచలము యొక్క గుహలయందు కాలమును గడుపుచుండిన యెడల, నది యాశ్చర్యజనకముకాదు. స్వస్థానమున (జన్మభూమియందు) స్థలము లేకుండుట వలన నిచటకు వచ్చెనాయేమి? ఓ పార్వతీ! ఏ కారణము వలన నతనికి కర్తవ్యమును చెప్పవైతివి.

ప్రభ:- నివాసభూమిని విడిచి, కార్యవిశేషము కొఱకే యిచటకు రమణుఁడరుదెంచెను. కాని వాసస్థలము లేకుండుట వలనఁగాదు. అతనికి నీవు కర్తవ్యమును జెప్పవయితివి. కావున నీపాదమును ధరించి శాంతి సమృద్ధుడై వెలయుచున్నాఁడు. నీ వాదేశమిచ్చు చుండిన యెడల నిస్సంకల్పుఁడును, మహాత్ముఁడును, అగు ఆ మహర్షి దానిని తప్పక చేయఁగలడు.

మూ॥ పరిభణతిచేచ్ఛి ష్యవ్యూహే మహాద్భుతసజ్జతీ
ర్జనని! రమణో యోగీశానస్తతో బహు నో ఫలమ్।
అమితతమయాదృష్టేః శక్త్యైకదాసరణిం నయే
దపథపతితం ధాత్రీలోకం తదేవ వదామ్బికే! 9

జననీ! యోగీశ్వరుఁడగు రమణుఁడు – ఉపదేశయోగ్యమగు శిష్యబృందమున మహాశ్చర్యకరములగు సంగతులను చెప్పునెడల దాని వలన మాకు బహుళమగు ఫలము కలుగును. అంబికా! మార్గభ్రష్టమగు భూలోకమును మిక్కిలి బహులమగు దృష్టిబలము చేత నెప్పుడు మార్గమును పొందించునో దానినే చెప్పుము.

మూ॥ అహమిహకుతో హేతోర్జాతో విషన్నతమేస్థలే
చరణకమలచ్ఛాయాం మాయాధిరాజ్ఞి! విహాయ, తే।
పరమకరుణో ఘోరఃశాపః కిమేష సవిత్రి! తే
కి మపి భువివా కార్యం కర్తుం నియోజితవత్యసి. 10

మాయేశ్వరివగు జననీ! నీ పాదకమలచ్ఛాయను విడిచి – ఈ భూలోకమున శోకదాయిష్ఠమగు స్థలమునందేకారణము వలన జన్మము నొందితిని? సవిత్రీ! ఇది ఘోరమగు నధికశోకమును గలిగించు నీ శాపమా? లేక, భూమియందేదయిన కార్యము నొనర్చుటకు నియోగించుచున్నావా?

ప్రభ:- నేను నీ శాప విశేషము వలన నిచట పతితుఁడనైతినా? లేక కార్య విశేషము నొనర్చుటకు నీచేత ప్రేరితుఁడనా?

మూ॥ వ్రజతివిలయం స్నేహో దూర ప్రవాసవశాదితి
ప్రవదతిబుధః కశ్చిత్ సత్యం ప్రభాతి తదమ్బికే!
భగవతి! నిజేకుక్షౌ జాతం దివో ధరణీగతం
స్మృతిసరణితో దూరే హాహా! కరోషిరుషాయథా 11

భగవతీ! అంబికా! ''వియోగజనకమగు దూర దేశాంతర నివాసము వలన స్నేహము (ప్రేమ) నశించును'' అని లోకము నందొక పండితుఁడు ప్రవచించిన మాట – నాకు సత్యముగాఁదోచుచున్నది. నీ యుదరమున జన్మించినవాఁడను, ద్యులోకమునుండి భూలోకమునకు వచ్చినవాఁడను, అగు నన్ను – రోషము చేతను వలె, నీ స్మృతిమార్గము నుండి దూరమొనర్చితివి? ఆహా! ఇది మిక్కిలి కష్టము.

ప్రభ:- ''కోపము చేతనువలె నన్ను స్మరింపక దూరమొనర్చితివి.'' అని భావము.

మూ॥ ష్మమతు విమలాహ్యాద్యావిద్యా మహేశ్వరి! యాఽభవ
న్మనసిచ పరాచిత్రాశక్తి శ్చిరన్తని! యాఽభవత్।
వచసిచ మహద్భాగ్యం శ్లాఘ్యం యదీడ్యతమేఽభవత్
తదయిగలితం మత్తో విత్తత్రయం భవతోభువి 12

మహేశ్వరీ! నేనీలోకమున జన్మించుటకు ముందు - నాకు శుద్ధమును, హృద్యమును, అగు విద్య, నిశ్చయముగా నుండెను. చిరంతనీ మనస్సునందు శ్రేష్ఠమును, చిత్రమును, అగు శక్తి యుండెను. ఈడ్యతమా! వాక్కునందు ప్రశంసింపఁదగినదియు, గొప్పదియునగు, వైభవముండెను. అమ్మా! ఆ యీ విత్తత్రయము - ఇప్పుడు భూలోకమునందు జన్మించిన నాయొద్దనుండి జారిపోయిది.

ప్రభ:-హృద్యమగు శుద్ధవిద్యయు, మాననియగు నద్భుతశక్తియు, ప్రశస్యమగు వాగ్విభూతియు, నే నీ భూమియం దుదయించుటకు ముందు నాయందుండెడివి. నాకు సహజమగు ఈ సంపత్త్రయి - భూసంపర్కము వలన గళితమయినది. ఇప్పుడు వాని వాసనమాత్రమే - మిలిగినదని గమ్యమగుచున్నది. ''శుద్ధ విద్య, విచిత్రమననశక్తి, వాగ్వీర్యము, అను మూటికిని గూడ - తన జీవితకాలమునందు ఈ మహాకవి యాకరమువలె నుండెను'' అను నంశము - నిర్మత్సరులగు సజ్జనులకందఱకును గూడ తెలిసియేయున్నది. కావున మూలమునందలి గలితశబ్దము చేత - ఈ మూఁడును గూడ వాసనామాత్రముచే మిగిలియున్నవనునది యుపపన్నమే యగును.

మూ॥ కృతమయి మయా పాపం ఘోరం సుకర్మసు సజ్జినామ్
యదహమదయో విఘ్నం నృణాం ముహుర్ముహురాచరమ్.
అతికటుఫలం తస్యాశ్నామి శ్రితో నరవిగ్రహమ్
ప్రమథనృపతేర్జాయే? మాయే! జనన్యవమామిమమ్. 13

అమ్మా! నేను ఘోరమగు పాపము నొనర్చితిని. సత్కర్మానుష్ఠానపరులగు మనుష్యులకు నేను నిర్దయుఁడనై, మాటిమాటికిని విఘ్నము నొనరించితిని. ఇదియే - నేనొనర్చినపాపమ 'ఆ' విఘ్నకర్మమునకు తగినదియు, మిక్కిలికఠోరమును, అగు ఫలము నిప్పుడు మనుష్యరూపము నాశ్రయించి యనుభవించుచున్నాను. ప్రమథగణముల కధిపతియగు శివునకు జాయవును, (ప్రేయసివియు) మహామాయవును, అగుజననీ! ఇట్టి దురవస్థగల నన్ను రక్షింపుము.

ప్రభ:- విఘ్నేశ్వరుఁడు - విఘ్నముల నొనర్చునను ప్రసిద్ధి గలదు. కాని, పూజింపఁబడిన యెడల నతఁడు యథార్థముగా విఘ్నములను తొలగించును. పూర్వము - తాను విఘ్నేశ్వరుఁడై సత్కర్మములకు విఘ్నమునొనర్చుటవలన నిప్పుడు గణపతి యనునామమున జన్మించి, దుఃఖము ననుభవింపవలసివచ్చినదని భావము.

మూ॥ నభవసి దృశో ర్మార్గే లోకాధిరాజ్ఞి! కుతో గిరో
న చ బహుకృపే స్వప్నే వాత్వం ప్రయచ్ఛసి దర్శనమ్
అపనయసినో సన్దేహం వా పరోక్షకృపావశా
దపి సురనుతే! లగ్నాకార్యాన్తరేక్ ముతాదయా. 14

బహు కృపవగు లోకేశ్వరీ! ఏల నా దృష్టిమార్గము నొందవు? స్వప్నము నందైనను మాటాడవు. దర్శనమీయవు, పరోక్షమగు (అ ప్రత్యక్షమగు) కృపావశము వలన నైనను ఏదోయొక్క నిమిత్తము చేత నాసం దేహమును నివారింపవు. ఓ సురవందితా! కార్యాంతరమున (వేరొకకార్యమున) లగ్నమై యున్నావా? లేక నీకు నాయందు దయ లేదా?

ప్రభ:- ''నీకు కరుణలేక యుండుట వలననే యీ యుపేక్ష కలిగినదా?'' అనిభావము.

మూ॥ నిరవధిశివే! మహాత్మ్యంతే భణన్తి మహర్షయో,
మనసి కరుణానన్యూనాతే, యథా ప్రథితాః కథాః।
తదిదమఖిలం మిథ్యాస్యాదిత్యసాధ్యముదీరితుం,
యదసి విముఖీపుత్రే కింవా భవేదిహ కారణమ్. 15

అపరిమిత కల్యాణివగు జననీ! 'నీ కథలు ప్రశిద్ధములు; నీ కరుణయధికము. మహర్షులు నీ మాహాత్మ్యమును కీర్తించుచున్నారు. కావున - ఇది యంతయు మిథ్యయని చెప్పుటకు శక్యము కాదు. పుత్రుడనగు నాయందు పరాఙ్ముఖివగుటకు కారణమోమో వచింపుము.

మూ॥ భువనభరణం నాల్పం కార్యం న దేవి! తవక్షణో
గురుచబహులం కృత్యం తవాస్తి నతన్మృషా।
న తవకఠినం మౌనం నిన్ద్యంతథాఽపి న పార్వతి
స్మర సకృదిమందీనం పుత్త్రం తదేవ మమాధికమ్॥ 16

దేవీ! నీ భువనపోషణము అల్పమగు కార్యము కాదు. నీకు నిర్వ్యాపార స్థితిలేదు. నీ నిత్యకృత్యము - బహులమును, దుర్భరమును, నైయున్నది. అది మృషకాదు. కఠినమగు నీ మౌనము - (మాటాడకుండుట) దూష్యము కాదు. అయినను - దుర్బలుఁడగు నీ పుత్త్రునొకసారి స్మరింపుము. అదియే నాకుఁజాలును.

ప్రభ:- నీ కార్యభారము - సత్యమే యగును. అయినను, నన్నొకసారి చింతింపుమని భావము.

మూ॥ నభవతి సుధాధారా వర్షాదయం ముదిత స్తనౌ
మధుమదముషాం వాచాం సర్గాన్న చాప్యయముద్ధతః।
తవపదయుగే నిష్ఠాలాభాన్నతృప్యతి చాప్యయం
భగవతి! చిరాత్ సన్దేశం తే సుతః ప్రతివీక్షతే॥ 17

ఈ నీ భక్తుఁడు- (తనౌ) శరీరము నందగు సహస్రారామృత వర్షము వలన సంతోషించుట లేదు. ఈ కవి - మధుమదమును దొంగిలించుచున్న వాక్కులను సృజించుట వలనను గూడ - ఔద్ధత్యము నొందుట (గర్వించుట) లేదు. వీఁడు - నీపదయుగమునందలి నిష్ఠ - లభించుట వలనఁగూడ - తృప్తి నొందుట లేదు. భగవతీ! ఈ నీ పుత్త్రుడు- చిరకాలమునుండియు నీ సందేశమును వినుటకు ప్రతీక్షించుచున్నాఁడు.

విశే:- మూలము నందలి పాదత్రయమున - అమృతవర్షాదులగు కారణములున్నను, సంతోషించుట మున్నగు కార్యములు కాన్పింకుండుట వలన - ఇది - విశేషోక్త్యలంకారమగుచున్నది - 'పుష్కలమగు కారణమున్నను, కార్యముజనింపకుండుట - విశేషోక్తి యగు' నగు నది - దీని లక్షణము. ఇందలి నాలుగవపాదమున జెప్పఁబడిన ''దేవీ సన్నిధి నుండి సందేశమును ప్రతీక్షించుట'' అను కారణము చేత - మొదటి పాదముల యందుఁ జెప్పఁబడిన యర్థములను సమర్థించుట వలన - కావ్యలింగమలంకారమగుచున్నది. ఆ కావ్యలింగమునకు - విశేషోక్తి -యంగమగుచున్నది. ఈ రెండును - నీరక్షీరన్యాయమున నిచట మిళితములగుట వలన, ఇది - అంగాంగభావముచే నగు సంకరాలంకార మగుచున్నది.

మూ॥ కిమిహభువనే కర్తవ్యం మే కిమర్థమిహాగతోఽ
స్మ్యవనిజగతాం కం వోపాయం శ్రయేనిజశక్తయే
కిమపి కిమపి స్వాన్తేధ్వాన్తే యథాపరిదృశ్యతే
స్ఫుటమభయదే! వక్తుం కిఞ్చిచ్ఛ్రమంత్వమురీకురు॥ 18

సర్వభయముల నుండియు రక్షించుదానవగు జననీ! నేనీభూలోకమున చేయఁదగిన దేమున్నది? నేనిచ్చటికేల వచ్చితిని? (నేనేల జన్మించితిని?) భువనావనీ! స్వీయమగు శక్తి నొందుటకు నేనేయుపాయము (సాధనము) నాశ్రయింతును? నేను చింతింపఁజాలనిదియు, నీవు చూపఁజాలినదియు, నగుతత్త్వము - ఏ ప్రకారము చేతనైనను, నా స్వాంతమునందును, ఈ ధ్వాంతము (అజ్ఞానము) నందును, గోచరించునట్లు స్పష్టముగా (నిస్సందేహముగా) చెప్పుటకు కొంచెము ప్రయాసము నంగీకరింపుము.

మూ॥ నమమపరమే ముక్తావాశానవావిభవాష్టతే।
నచ గజఘటాపూర్ణాయాంవా మహేశ్వరి! సమ్పది।
నచమధుముచాంవాచాంసర్గే నిరర్గళవైభవే
ముని భువికుతోజాతః సోహం తదేవ సమీర్యతామ్. 19

ఓ పరమ జననీ! నాకు మోక్షమునందు దీర్ఘమగు తృష్ణలేదు. అణిమాదులగు అష్టైశ్వర్యములయందుఁగూడ - ఆశలేదు. మహేశ్వరి! గజఘటాదిపూర్ణమగు సంపదయందుఁగూడ - ఆశలేదు. మకరందనిష్యందినులగు వాక్కుల యొక్క నిరర్గళమగు వైభవము గల సృష్టి యందుఁగూడ నాశలేదు. **ఋషినిలయమగు ఈ భారత భూమియందు నీ పుత్రుఁడనగు నేనేల జన్మించితినో (నాజనన కారణమేమో) దానినే తెలుపుము** (మోక్షము, అష్టైశ్వర్యములు, సంపద, కవితా సృష్టి, అను నీనాల్గును గూడ నేను గోరకున్నను, నేనేలయిచటఁ బుట్ట వలసివచ్చెనో తెలుపవమ్మా! అని ప్రశ్నింపఁబడినది).

మూ॥ ప్రథమ మనఘం వాఞ్ఛామ్యన్నం స దారసుతాతిథేః
భగవతి! తతః పాదద్వన్ద్వే తవావిచలాం స్థితిమ్।
అథ సురజగద్వార్తాజ్ఞానం సవిత్రి। తతః పరమ్।
ముని భువిభవే హేతుం జ్ఞాతుం మృగాక్షి! పురద్విషః॥ 20

భగవతీ! మొదట భార్యాపుత్రాదులకై దోషము లేని యన్నమును వాంఛించుచున్నాను. తరువాత నీపాదద్వంద్వమున నిశ్చలమగు నిష్ఠను వాంఛించుచున్నాను. పురారి సుందరివగు పార్వతీ! పిమ్మట దేవలోక వృత్తాంతజ్ఞానమును గోరుచున్నాను. పిదప ముని భూమియగు భారతదేశమున జన్మించుటయందగు హేతువును దెలియనెంచుచున్నాను.

ప్రభః:- ఇట్లు, నాకు వాంఛాపరంపర యున్నదని భావము.

మూ॥ యదితవకృపాపుత్రే భక్తేపదాంబుజవన్దిని!
వ్రతశతకృ శేశీర్షామ్భోజామృతం త్వయిజుహ్వతి
భరతధరణీ సేవాలోలే భవప్రియభామిని!
స్వయముపది శాముష్మైయోగ్యం విధానమనావిలమ్. 21

శివప్రియజాయవగు జననీ! భవత్పదారవిందములను స్తుతించువాఁడను, అనేకవ్రతముల చేత (అహోరాది కఠిన నియముల చేత) కృశించిన శరీరమున సహస్రారనిష్యందియగు అమృతమును నీ యందు హోమము నొనర్చువాఁడను, భారతభూమికి కైంకర్యము నొనర్చుట యందు నిరతుఁడను, భక్తుఁడను, అగు నీ పుత్రునియందు కృపయున్న యెడట - నీవీ పుత్రుని కొఱకు స్వచ్ఛమును, యోగ్యమును అగుపద్ధతి నుపదేశింపుము.

మూ॥ జనని! జగతాం స్వల్పేకామేఽప్యయంత్వయిలమ్బతే
పురభిదబలేమధ్యేకామేఽప్యయం త్వయిలమ్బతే।
బహులకరుణే శ్రేష్ఠే కామేఽప్యయం త్వయిలమ్బతే
భగవతి! పరేవీతే కామేఽప్యయం త్వయిలమ్బతే. 22

జగజ్జననీ! ఈ నీ భక్తుఁడు (నేను) కామము (కోరిక) స్వల్పమయి నప్పుడును - నిన్నే యాశ్రయించుచున్నాఁడు. కామము - మధ్యమయినప్పుడు గూడ - నిన్నే యాశ్రయించుచున్నాఁడు. బహులకృపవగు జననీ! కామము - శ్రేష్ఠమగునప్పుడుగూడ - నిన్నే యాశ్రయించుచున్నాఁడు. భగవతివగు జననీ! కామము - విగతమయినను గూడ - నిన్నే యాశ్రయించుచున్నాఁడు.

ప్రభః:- సకాముఁడనైనను, నిష్కాముఁడనైనను, నిన్నే యాశ్రయించు చున్నాను. భారమునంతను నీపాదపద్మములయందే యుంచితినని భావము.

మూ॥ తనుభువిమయి ప్రీత్యావామ్బ! త్రిలోకవిధాయికే।
పదయుగరతే వాత్సల్యాద్వాపురారి పురన్ధ్రికే!
స్వవిమలయశోగానాసక్తే కృపావశతోఽథవా
పరుషమజరే! మౌనం త్యక్త్వా స్ఫుటీకురుమేగతిమ్ 23

త్రిలోకధాత్రి! శివప్రేయసీ! జరావిరహితవగు దేవీ! తనూజుఁడనగు నాయందలి ప్రీతిచేతఁగాని, చరణభక్తునియందలి వాత్సల్యము చేతఁగాని, నీ పవిత్ర

కీర్తిని గానము చేయుటయందాసక్తి గలయా కవియందలి కారుణ్యముచేఁగాని, కఠినమగు మౌనమును విడిచి, గతిని (గంతవ్యోపాయమును) ప్రదర్శింపుము.

మూ॥ జయతు భరతక్షోణీఖణ్డం విషాద వివర్జితం
జయతు గణపస్తస్య క్షేమం విధాతు మనాముని:
జయతు రమణ స్తస్యాచార్యో మహర్షికులాచలో
జయతు చ, తయోర్మాతా పూతా మహేశ విలాసినీ 24

భారతఖండము దుఃఖశూన్యమై వెలయుఁగాత! ఆ భారత ఖండమునకు క్షేమము నొనర్పగోరిన మునియగు గణపతి వెలియుఁగాత (జయించుగాక!) ఆ గణపతి మునికి – ఆచార్యుఁడును, మహర్షికుల శ్రేష్ఠుఁడును, అగు రమణుఁడు వెలయుగాత! ఆ గణపతి – రమణులకు మాతయు, పూతయు, అగు మహేశ్వరకుటుంబిని వెలయుఁగాత!

ప్రభ:- ''గృహీతముక్తరీత్యార్థ శ్రేణి రేకావలిర్మతా'' అను లక్షణము వలన – భరతఖండ – తత్ క్షేమ విధాయి గణపతి – తదాచార్యరమణ–తన్మాతృ పరమేశ్వరులు క్రమముగాఁ గ్రహింపఁబడి, విడువఁబడుట వలన, ఇది – ఏకావళి అనునలంకృతియగుచున్నది.

మూ॥ గణపతిమునే రేషాభాషా హృదయఙ్గమా
సుకవిసుహృదః శబ్దైరత్యుజ్వలాహరిణీతతిః
లలితచతురైర్భావైర్యాన్తీ సురూపవనాన్తరం
మదయతుమనః కామారాతేర్నిశాన్తమృగీదృశః॥ 25

సత్కవిప్రియుఁడగు గణపతి మునికి సంబంధించిన యీ వాణి – విద్వాంసులకు హృదయంగమయై ప్రయోగింపఁబడిన శబ్దముల చేత బహుశోభమానయై యున్నది. ఈ హరిణీతతి – (మృతీసమితి, లేక హరిణీ వృత్తనిబద్ధస్తుతి) లలితచతురములగు భావముల చేత (కోమలములును, కుశలములును, అగు రీతుల చేత లేక అభిప్రాయముల చేత) సురూపవనాంతరమున (మనోజ్ఞమగు వనములోపల, లేక వనముల వంటి పండితుల హృదయమున) ప్రవేశించి, కామారాతియగు శివుని గృహ సుందరియగు పార్వతీ దేవి యొక్క మనస్సును హర్షింపఁజేయుగాత.

ప్రభ:- హరిణీతతి అనఁగా ఆఁడలేళ్లగుంపు, అహరిణీపంక్తి – కోమల చతుర భావముల చేత సుందరమగు వనమునఁ బ్రవేశించి మృగీవలోచనయగు సుందరి – మనస్సును రంజింపజేయువిధమున, హరిణీతతి రూపమగు గణపతి భాష – బుధహృదయాకర్షకమై పార్వతి మనస్సు నానందింపఁజేయుఁగాతమని భావము.

ఇచట శ్లేషోత్థాపితమగు ఉపమాలంకారము – ధ్వనించుచున్నదని తెలియునది.

ఇది – సవ్యాఖ్యమగు చతుస్త్రింశ స్తబకము.

* * * *